క్లుప్తంగా

తహసీల్దార్‌గా సుభాని బాధ్యతల స్వీకరణ



మంగళగిరి: స్థానిక తహసీల్దార్‌గా గురువారం షేక్ హహబూబ్ సుభాని బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. గతంలో తాడేపల్లి సూపరింటెండెంట్‌గా సుభాని పని చేశారు. పెదనందిపాడులో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీలలో భాగంగా మంగళగిరి తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

తెగుళ్లపై పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఫిరంగిపురం: ప్రస్తుత వర్షా కాల సీజన్‌లో పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నగేష్ సూచించారు. మండలంలోని రేపూడి, మేరికపూడి, ఫిరంగిపురం గ్రామాల్లోని పత్తి పంటను ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఆకుముడత, పచ్చదోమ నివారణకు ఫిపోనిల్ 2 ఎం.ఎల్. ఒక లీటరు నీటిలోకలిపి వారం వ్యవధిలో అవసరాన్ని బట్టి రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. దానితో పాటు బస్తా డీఏపీ, బస్తా యూరియా, 25 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను 30రోజుల వయస్సున్న పంటలో వెద పెట్టుకోవాలని సూచించారు. ఆయనతో పాటు విస్తరణ అధికారి సుభాని, గ్రామ సహాయకులు కె.కిరణ్ కుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంగళగిరి: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై భారీగా ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన పట్టణంలోని గణపతినగర్‌లో జరిగింది. చిల్లపల్లి నాగేంద్రం అద్దె ఇంట్లో నివసిస్తూ విజయవాడలో బంగారం వ్యాపారం చేస్తున్నారు. ఆయన గురువారం ఉదయం దుకాణానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసే సమయంలో ఏసీ ఆన్ చేయగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. దీంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. నాగేంద్రం కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. అగ్నిమాపక యంత్రం వచ్చి మంటల్ని అదుపులోకి తేవడంతో ప్రమాదం తప్పింది. రూ.18 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు నాగేంద్రం తెలిపారు.

తుళ్లూరు ఎంఈవోగా షేక్ సుభాని బాధ్యతలు



తాడికొండ: తుళ్లూరు ఎంఈవోగా షేక్ మహబూబ్ సుభాని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 కె. ప్రభాకరరావు, యూటీఎఫ్ తుళ్లూరు మండల అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.భాస్కరరావు, జిల్లా నాయకులు అడవి శ్రీనివాసరావు, సీహెచ్. ఆదినారాయణ, అబ్దుల్ ఖాసిం, వి. ప్రసాద్, టి. ఉమామహేశ్వరరావు, కల్యాణ్, పి. శ్రీనివాస్, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటకాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి పల్నాటి యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకాలను ప్రదర్శించారు. తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సమతా నాటక గురుకుల వ్యవస్థాపక కార్యదర్శి, కందుకూరి వీరేశలింగం అవార్డు గ్రహీత వరయూరి రామానుజసూరి 14వ సంస్మరణ సందర్భంగా పల్నాటి యుద్ధంలోని నాగమ్మ పూజ సీను, మాంచాల సీను, సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. హరిశ్చంద్రగా అమ్మిశెట్టి రంగారావు, హేమంత్‌కుమార్, నక్షత్రకుడిగా జి.వెంకటేశ్వర్లు, చంద్రమతిగా రత్నజ, వీరబాహుడిగా జి.గురునాథం, కాలకౌశికగా బాబూరావు, శిష్యగా శివయ్య, నాగమ్మ పూజ సీను, మాంచాల సీనులో బాలచంద్రగా ఎం.కుమార్ బాబు, మాంచాలగా లహరి నటించారు. కార్యక్రమాన్ని అమ్మిశెట్టి రంగారావు పర్యవేక్షించారు.

పింఛన్ కష్టాలు మళ్లీ మొదలు !

- వృద్ధుల్లో ఆందోళన
- ఇంటి వద్ద నగదు పంపిణీకి మంగళం
- గుంపుగా ఒకే చోట పంపిణీ
- పింఛన్ తీసుకునేందుకు వేచి ఉండాల్సిన పరిస్థితి
- ఆలస్యంగా పనులకు వెళ్లాల్సిన దుస్థితి



వేములూరిపాడులో పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది

ఫిరంగిపురం: వృద్ధులకు పింఛన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలో వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వలంటీర్లు తెల్లవారకముందే ఇంటి దగ్గరికి వెళ్లి నగదు అందించేవారు. కాగా నేడు గ్రామాల్లో తక్కువ సంఖ్యలో సచివాలయ సిబ్బంది ఉండటంతో సమస్య ఏర్పడింది. గ్రామంలోని ఒకటీ, రెండు ప్రాంతాల్లో సిబ్బంది మకాం వేసి నగదు అందిస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల పింఛన్ కోసం నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లలేక పోతున్నారు. ఇక రెక్కాడితే గానీ డొక్కాడని కూలీల పరిస్థితి దారుణంగా ఉంది. పొలం పనులకు వెళ్లాల్సిన వారు సచివాలయ సిబ్బంది కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఇక సచివాలయ సిబ్బంది కూడా ఒత్తిడితో సతమతమవుతున్నారు. ఒక్కొక్కరూ వంద మందికి దాకా పింఛన్లు అందజేస్తున్నారు. అటు డబ్బు లెక్కలు, ఇటు ఐరిస్‌తో పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పింఛన్ల పంపిణీని సచివాలయం సిబ్బంది చేపట్టారు. మండల వ్యాప్తంగా 9,361 మందికి గానూ రూ. 4,01,2,500 మంజూరైనట్లు ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది తెలిపారు. సాయంత్రానికి 9,031 మందికి పింఛన్లు అందజేశామని, మిగిలిన వారికి శుక్రవారం అందజేయనున్నట్లు చెప్పారు.

76 శాతమే పింఛన్ల పంపిణీ

మేడికొండూరు: మండలంలో గురువారం పింఛన్ల పంపిణీ 76 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. 14 గ్రామ సచివాలయాల పరిధిలో సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి నగదు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బందెల రమేష్, మాజీ ఎంపీపీ సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుతో అన్ని తెగలకు న్యాయం

తాడేపల్లి రూరల్: ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఆదివాసీ మేధావుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు అనుముల వంశీకృష్ణ అన్నారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తీర్పునిచ్చిన సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీష్ చంద్ర, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ బి.ఆర్. గవాయిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యా, ఉద్యోగాల్లో ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు, ఉప వర్గీకరణ సమంజసమే అని పేర్కొన్నారు. రాజ్యాంగ పరంగా సంక్రమించిన రిజర్వేషన్ ఫలాలు వెనుకబాటుకు గురైన అన్ని వర్గాలకు, అన్ని తెగలకు దక్కాలని అభిప్రాయపడ్డారు. ఎస్టీ రిజర్వేషన్ కొన్ని తెగలకు వరంగా కొన్ని తెగలకు శాపంగా మారిందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా అన్ని తెగలకు జనాభా నిష్పత్తి ప్రకారం న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు.

తీర్పు అమలుకు కేంద్రం త్వరితగతిన చర్యలు

తాడికొండ: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పునివ్వడం హర్షించదగ్గ విషయమని భాజపా గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి, తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును ఆయన స్వాగతించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ ఇచ్చిన ప్రకారం ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. దీన్ని అమలు చేసేందుకు కేంద్రం త్వరితగతిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

తల్లిపాలతో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు తగ్గుముఖం



గణపతినగర్ హెల్త్ సెంటర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ అనూష

మంగళగిరి: శిశువుకు పాలు ఇవ్వడం వల్ల మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు తగ్గుతాయని పట్టణంలోని గణపతినగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. అనూష తెలిపారు. హెల్త్ సెంటర్‌లో గురువారం తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. పలువురు మెడికల్ ఆఫీసర్లు హాజరయ్యారు. గర్భిణులకు, బాలింతలకు తల్లి పాల విశిష్టతను వివరించారు. శిశువుకు పాలు ఇవ్వడం ఇద్దరికీ ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వడం వల్ల వ్యాధినిరోధకశక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతాయని సూచించారు. శిశువుకు పాలు ఇవ్వడం వల్ల తమ శరీర ఆకృతి చెడిపోతుందనే అపోహల్ని వీడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎయిమ్స్ సీఎంఎఫ్ వైద్యులు డాక్టర్ కావ్య, డాక్టర్ అంకిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

10న బాలోత్సవం ఆధ్వర్యంలో పోటీలు



ప్రధానోపాధ్యాయులకు బ్రోచర్లు అందజేస్తున్న బాలోత్సవం నిర్వాహకులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పలు పాఠశాలలకు మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పలు పోటీలు నిర్వహించనున్నారు. బాలోత్సవం నిర్వాహకులు గురువారం పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బ్రోచర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటీఎంసీ కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తాడేపల్లి ఆశ్రమం రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో ఈనెల 10వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు మూడు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో (3,4,5 తరగతులు) జెండా వందనం, జూనియర్స్‌విభాగంలో (6,7 తరగతులు) మీకిష్టమైన స్వాతంత్య్ర సమర యోధుడు, సీనియర్స్ విభాగంలో (8,9,10 తరగతులు) స్వాతంత్య్ర ఉద్యమంలో ఏదైనా ఒక ఘట్టంపై వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేయనున్నామని వివరించారు. పోటీలలో పాల్గొనే వారు 7వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9490099559 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అమరావతి ఐకాన్ మిత్ర బృందం వై. బాలకృష్ణ, దుర్గి కోదండరామయ్య, బిట్రా రామారావు పాల్గొన్నారు.

100 మంది పోలీసులకు కంటి పరీక్షలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మాక్సివిజన్ ఐ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ కోఆర్డినేటర్ ఎ. మునీశ్వర్ మాట్లాడుతూ తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లోని సిబ్బందితో పాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి కూడా కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇందులో సమస్యలు ఉన్న వారికి విజయవాడలోని మాక్సివిజన్ ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత పరీక్షలు నిర్వహిస్తామని, మిగిలిన వాటికి ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో పాటు దాదాపు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యులు ఎండీ. అహ్మద్ పాషా, కౌన్సిలర్ ఎం. రాజేశ్వరి పాల్గొన్నారు.

• పింఛన్ల పంపిణీకి 'పచ్చ' రంగు



కొప్పురావు కాలనీలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధతో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్న నగర కమిషనర్ ఎస్‌కే అలీంబాషా తదితరులు

పింఛన్ల పంపిణీలో టీడీపీ నేతల హడావుడి ఎక్కువైంది. కార్యక్రమానికి 'పచ్చ' రంగు పులుముతున్నారు. ఆయా వార్డులలో తాము వచ్చే వరకు నగదు పంపిణీ చేయవద్దంటూ హుకుం జారీ చేస్తున్నారు. చోటా నేతలు కూడా సచివాలయాల సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లు, గ్రూప్ హౌస్‌ల వద్ద నగదు పంపిణీ చేయడంతో వృద్ధులు అవస్థలు పడుతున్నారు. కూటమి పాలనలో పింఛన్ల పంపిణీ ప్రహసనంగా మారిందని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. - మంగళగిరి

అన్న క్యాంటీన్ల పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్ హరికృష్ణ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో జరుగుతున్న పనుల్ని గురువారం నగర కమిషనర్ ఎస్.హరికృష్ణ పరిశీలించారు.నగరపాలక సంస్థ పరిధిలో చుట్టుగుంట, మిర్చి యార్డ్, నల్లచెరువు, పల్నాడు బస్టాండ్, ఆర్టీవో ఆఫీస్, ఐడీ హాస్పిటల్, బస్టాండ్ ప్రాంతాల్లో క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆయన ఆదేశించారు. క్యాంటీన్ పరిసరాలలో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకోవాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలకు అనుగుణంగా, నాణ్యత ప్రమాణాల్లో రాజీ లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎం.శ్యాం సుందర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు రమేష్ బాబు, శ్రీధర్, హనీఫ్, సతీష్, ఏఈలు రాంబాబు, సునీల్ కుమార్, నాగవేణి, సాంబశివరావు, సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరంలో 98శాతం పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నగరంలో గురువారం సాయంత్రానికి 98శాతం పూర్తయిందని కమిషనర్ ఎస్. హరికృష్ణ తెలిపారు. 58,971 మందికి గాను 57,703 మందికి నగదు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల అందుబాటులో లేని 1,268 మందికి శుక్రవారం ఉదయం అందిస్తామని చెప్పారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య వీరయ్య



ఆచార్య వీరయ్యకు అభినందనలు తెలుపుతున్న వీసీ తదితరులు



వీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రూనీస్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జువాలజీ విభాగ సీనియర్ అధ్యాపకులు ఆచార్య కె. వీరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం నియామక ఉత్తర్వులు అందజేసి అభినందనలు తెలిపారు. సైన్స్ కళాశాలను విద్య, బోధన, పరిశోధన రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులు ఆయనకు సూచించారు. సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఫిజిక్స్ విభాగ అధ్యాపకులు ఆచార్య రవికుమార్ నియమితులయ్యారు. అభినందనలు తెలిపిన వారిలో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య పద్మావతి, ఆచార్య ఎం. త్రిమూర్తి రావు, ఆచార్య సురేష్‌కుమార్ ఉన్నారు.

యూనివర్సిటీని సందర్శించిన ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్. రూనీస్ గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలాన్ని కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం యూనివర్సిటీలో విద్యార్థినులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. యూనివర్సిటీలో క్రీడా వసతులు, గ్రంథాలయం, ఫైన్ ఆర్ట్స్ కళాశాల, బొటానికల్ గార్డెన్ తదితర ప్రాంతాల్ని సందర్శించారు. మౌలిక వసతులు పరిశీలించారు. ఆమె వెంట ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మల్లవరపు పవన్ కుమార్, విశ్వవిద్యాలయ అధ్యక్షురాలు డి. హర్షిత, ఇన్‌చార్జ్ మోహన్ , సెక్రటరీ మణికంఠ, గుంటూరు టెక్నికల్ సెల్ కన్వీనర్ శివ గణేష్, ఎ. శాంభవి, హేమంత్ రామ్, సాయి, హరీష్, శివ రామరాజు, నానాజీ, భానుప్రకాష్, శ్రీనివాస్, యుగంధర్, దత్త, సిద్ధు, వినయ్, గంగాధర్ ఉన్నారు.

ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి సత్కారం



అప్పిరెడ్డిని సత్కరిస్తున్న నూరిఫాతిమా, పార్టీ నేతలు

పట్నంబజారు: శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా నియమితులైన ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిని బుధవారం పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా సత్కరించారు. మంగళదాస్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా నివాసానికి వచ్చిన క్రమంలో సమన్వయకర్త నూరిఫాతిమా, వైఎస్సార్ సీపీ శ్రేణులు అప్పిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

నగరంలో పోలీసుల మెరుపుదాడి

- మరోసారి విస్తృతస్థాయిలో నాకాబందీ
- తనిఖీల్లో ఏఎస్పీలు, డీఎస్పీలు
- పది ప్రదేశాల్లో 150 మందితో ప్రత్యేక డ్రైవ్
- 194 మోటారు సైకిళ్లు, ట్రాక్టర్, ట్రక్ ఆటోలు సీజ్
- మైనర్లకు వాహనాలు అప్పగించవద్దని జిల్లా ఎస్పీ సూచన



బ్రాడీపేటలో 4లైనులో స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: నగరంలో పోలీసులు మెరుపుదాడి చేశారు. ఏకకాలంలో తూర్పు, పశ్చిమ సబ్ డివిజన్లల్లో గురువారం సాయంత్రం మరోసారి నాకాబందీ విస్తృతంగా నిర్వహించారు. రెండు సబ్ డివిజన్లల్లోని పది ప్రధాన కూడళ్లల్లో తనిఖీలు జరిపారు. దీనికి పది బృందాలను ఎస్పీ ఏర్పాటు చేశారు. ఒక్కో బృందానికి 15 మంది చొప్పున 150 మంది ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఒక్కొక్క బృందానికి ఏఎస్పీలు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఇతర స్థాయి సిబ్బంది నేతృత్వం వహించారు. వీరంతా ఒక్కసారిగా ప్రధాన కూడళ్లపైకి వచ్చి తనిఖీలు చేపట్టారు. ఆయా ప్రధాన రహదారుల మీదుగా రాకపోకలు సాగించే మోటారు సైకిళ్లు, వాహనాలు నడిపే మైనర్లను, డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి మత్తులో ఊగే చోదకులు, పత్రాల్లేని వాహనాలను గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ హిందూ కళాశాల కూడలి ప్రాంతంలో జరిగిన తనిఖీలకు హాజరయ్యారు. మైనర్లు, వారి తల్లిదండ్రులకు మరోసారి క్లాస్ తీసుకున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని గతంలో చెప్పామని గుర్తు చేశారు. మరలా అప్పగిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు వాహనాలను అప్పగించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఏవైనా ప్రమాదాలు జరిగితే ఎవరూ బాధ్యులని పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమని చెప్పారు. గుంటూరు నగరంలో స్నేక్ డ్రైవ్, గొలుసు దొంగతనాలు, ఈవ్ టీజింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. త్వరలో మిగతా పోలీస్ సబ్ డివిజన్లల్లోనూ కొనసాగుతుందని చెప్పారు.

- తూర్పు సబ్ డివిజన్ లాలాపేట పీఎస్ పరిధిలో మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా వద్ద తనిఖీల్లో 27 వాహనాలు సీజ్ చేశారు. కొత్తపేట పీఎస్ పరిధిలో ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద 35 వాహనాలు, పాత గుంటూరు పీఎస్ మంగళగిరి రోడ్డులో 53 వాహనాలతో పాటు ట్రాక్టర్, ట్రక్ ఆటో సీజ్ చేశారు.
- పశ్చిమ సబ్ డివిజన్ అరండల్‌పేట పీఎస్ పరిధిలో బ్రాడీపేట 4/1వ అడ్డరోడ్డు వద్ద 34 వాహనాలు, నగరంపాలెం పీఎస్ పరిధిలో ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాల వద్ద 11 వాహనాలు, పట్టాభిపురం పీఎస్ పరిధిలో లక్ష్మీపురం బేకర్స్ ఫన్ వద్ద 34 వాహనాలు సీజ్ చేశారు. తనిఖీల్లో జిల్లా ఏఎస్పీలు నచికేత్ షెల్కే (తూర్పు సబ్ డివిజన్), ఎ.శ్రీనివాసరావు (క్రైం), శ్రీనివాసరావు (ఎల్‌ఓ), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు సుబ్బారావు (దిశ), శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), మల్లికార్జునరావు (ఎస్సీ, ఎస్టీ సెల్), శివాజీ (సీసీఎస్), మహేష్ (పశ్చిమ), ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే రిపోర్టు కోసం ప్రజల అవస్థలు

కలెక్టర్ నాగలక్ష్మి దృష్టికి తీసుకెళ్లిన డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తుల సర్వే రిపోర్టు పొందేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనినగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లోన్లకు, ఆస్తుల క్రయ, విక్రయాలకు ఆస్తి సర్వే రిపోర్టు తప్పనిసరి అయిన నేపథ్యంలో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. 2024 జనవరి నుంచి ఆస్తి డాక్యుమెంట్‌లో టౌన్ సర్వే నంబర్ ఉంటేనే నగరపాలక సంస్థ తరఫున సర్వే చేస్తామని అధికారులు అంటున్నారన్నారు. డీ నంబర్ ఉన్నవాటికి సర్వే చేయమని, 1923 బీఎస్‌ఓ (బోర్డ్ స్టాండర్డ్ ఆర్డర్స్) రూల్స్ చూపి నగరపాలక సంస్థ అధికారులు సర్వే రిపోర్టు ఇవ్వడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై జనవరిలో అప్పటి నగర కమిషనర్ కీర్తి చేకూరి బీఎస్‌ఓ రూల్స్ ప్రకారం నగరపాలక సంస్థ సర్వే రిపోర్టు ఇవ్వడానికి వీలుపడదని, తగిన ఆధారాలతో కలెక్టర్‌కు నివేదించినట్లు గుర్తు చేశారు. దీనిపై అప్పటి కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారు రెండు వేలకు పైగా సర్వే రిపోర్టులు పెండింగ్‌లో ఉండటతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో సర్వే రిపోర్టులు ఇస్తున్నారని, గుంటూరు నగరపాలక సంస్థలోనే ఈ విధంగా ఇవ్వకుండా ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. రెండు రోజుల్లో సమస్యకు తగిన పరిష్కారం చూపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

నార్త్ క్లబ్‌లో అంతుచిక్కని సస్పెన్స్

చోద్యం చూస్తున్న పోలీస్ శాఖ

లక్ష్మీపురం: గుంటూరు నగర నడి బొడ్డులోని జిల్లా ఎస్పీ కార్యాలయానికీ, పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న స్వామి థియేటర్ వద్ద ఉన్న నార్త్ క్లబ్ వ్యవహారం అంతుచిక్కకుండా ఉంది. ఇక్కడ అధికార పార్టీ నాయకులు అండదండలతో పేకాట ప్రారంభించారు. అయితే, గురువారం క్లబ్‌లోకి పదుల సంఖ్యలో మహిళలు వచ్చి నిరసనకు కూర్చున్నారు. లీజు వ్యవహారంలో వివాదం చోటు చేసుకోవడంతో ఒక వర్గానికి చెందిన వారు మహిళలు, యువకులను క్లబ్‌కు తీసుకు వచ్చారని కొంతమంది అంటున్నారు. వచ్చిన వారిలో కొందరితో క్లబ్ నిర్వాహకులు మాట్లాడే ప్రయత్నం చేయడం ప్రారంభించారు. చిత్రంగా కొంత సమయానికి వచ్చిన వారందరూ ఎలా వచ్చారో అలా తిరిగి వెళ్లి పోయారు. నార్త్ క్లబ్‌లో అసలు ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రయత్నం చేయగా రకరకాలు చెబుతున్నారు. క్లబ్ నిర్వహణ వ్యవహారమని, ఆస్తిదారుల మధ్య స్థల వివాదం అంటూ భిన్న కథనాలు విన్పిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పట్టాభిపురం పోలీసులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.